క్లుప్తంగా

రైతు బజారులో త్వరలో శాశ్వత దుకాణాలు



గుంటూరు వెస్ట్: రైతు బజారు కోసం కేటాయించిన స్థలంలో త్వరలోనే శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేస్తామని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ్ తెలిపారు. శనివారం స్థానిక కృష్ణనగర్‌లోని రైతు బజారులను ఆయన తనిఖీ చేశారు. కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిపాయలు, టమోటా క్రయ విక్రయాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదరణ పొందిన రైతు బజారులు మరింత పటిష్టంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సహాయ మార్కెటింగ్ సంచాలకులు పి.సత్యనారాయణచౌదరి పాల్గొన్నారు.

కోబాల్డ్‌పేటలో శానిటేషన్ డ్రైవ్

లక్ష్మీపురం: పశ్చిమ నియోజక వర్గ పరిధిలోని 35వ డివిజన్ పరిధిలో ఇటీవల భారీ వర్షానికి కోబాల్డ్‌పేట ప్రాంతంలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంతో వర్షపు నీరు నివాస గృహాల్లోకి వచ్చిచేరింది. ఈ విషయం తెలిసిన తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు వర్షపు నీటిని తొలిగించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాణిక్యరావు పర్యవేక్షణలో ఉదయం నుంచి కోబాల్డ్‌పేట 6,7 లైన్‌లలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలిగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

లలితా హాస్పిటల్‌లో మతిమరుపుపై అవగాహన



గుంటూరు మెడికల్: అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన పెంచడానికి, అపోహలను తొలగించడానికి ప్రతిసంవత్సరం సెప్టెంబర్ 21న వరల్డ్ అల్జీమర్స్ డే నిర్వహిస్తున్నట్లు లలితా సూపర్ స్పెషాలిటీ గ్రూప్స్ హాస్పిటల్స్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో అల్జీమర్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్నియంత్రణలో ఉంచడం. నిత్యశారీరక వ్యాయామం చేయడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. కూరగాయలు, పండ్లు, సిరిధాన్యాలు అధికంగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యూరాలజిస్ట్ వీరమ్మ, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఉషకిరణ్, డాక్టర్ అజ్మ, డాక్టర్ యు.వీరమ్మ, డాక్టర్ రేష్మా, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ అజయ్, డాక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు




గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య- బొలిశెట్టి పాండురంగారావు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణతో ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను మరువరాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటున్నామని తెలిపారు. మనిషి పతనానికి ఈర్ష్య, ద్వేషాలు కారణమవుతాయని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, సుభద్ర, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మతిమరుపు.. కట్టడి చేయవచ్చు

నేడు వరల్డ్ అల్జీమర్స్ డే

- అల్జీమర్స్ సోకితే అన్నీ మరిచిపోతారు..
- ప్రతి ఏడాది పెరుగుతున్న మతిమరుపు బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో ఫలితం అంటున్న వైద్యులు



అల్జీమర్స్ డే పోస్టర్స్

గుంటూరు మెడికల్: వయస్సు పెరుగుతున్న కొద్ది మతిమరుపు సహజం. దీనినే అల్జీమర్స్ వ్యాధి అంటారు. ప్రతి మూడు సెకన్లకు ఒకరు వ్యాధి బారిన పడుతున్నారు. గతంలో విదేశాల్లో మాత్రమే ఈ మతిమరుపు వ్యాధిబారిన పడే వారిసంఖ్య అధికంగా ఉండేది. ప్రస్తుతం భారతదేశంలోనూ బాధితుల సంఖ్య పెరిగిపోయింది. ఆధునిక జీవనశైలి వల్ల యువతలో కూడా వ్యాధి పెరిగిపోవటం ఆందోళనకరమైన అంశమని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1994 నుండి ఏటా సెప్టెంబర్ 21న అల్జీమర్స్ డే నిర్వహిస్తోంది.

వ్యాధి లక్షణాలు...

వయస్సు పెరిగే కొద్ది కొందరు తమ పేరు మర్చిపోతారు. ఒకేచోట కూర్చుని వీడియో గేమ్స్, టీవీలు చూస్తూ ఉండటం, అతిగా మద్యం తాగడం, శారీరక, మానసిక వ్యాయామం లేకపోవటం, అధికకొవ్వు ఉన్న మాంసం తినటం వలన ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఎక్కువగా 60 ఏళ్లు దాటిన వారిలో వస్తోంది. ప్రస్తుతం 45 ఏళ్ల వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోంది.

ప్రతిరోజూ వైద్యం కోసం...

అల్జీమర్స్ వ్యాధికి చికిత్స కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మంది మానసిక వైద్య నిపుణులు, 15 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇరువురు లేదా ముగ్గురు వ్యాధి బాధితులు చికిత్స కోసం వస్తున్నారని వైద్యులు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతివారం ఇరువురు కొత్తగా వ్యాధి సోకినవారు, పది మంది పాతరోగులు వ్యాధితో బాధపడుతూ ప్రతిరోజూ చికిత్స కోసం వస్తున్నారు. ప్రతిశనివారం న్యూరాలజీ ఓపీ విభాగంలో అల్జీమర్స్ వ్యాధి బాధితుల కోసం ప్రత్యేకంగా ఓపీ వైద్యసేవలు అందిస్తున్నారు.

రోజువారి పనులు మరిచిపోతారు ....

వ్యాధి గ్రస్తులు రోజు వారి కార్యక్రమాలు మర్చిపోతారు. స్నానంచేయటం, బ్రష్ చేయటం, తిండితినటం కూడా మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లుగా అనుమానించటం, చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పటం, వస్తువుల పేర్లు మర్చిపోవటం, వాటిని ఏ విధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలో అనే అంశాలను సైతం మర్చిపోవటం రోగిలో కనిపిస్తాయి. ఇంటికి తాళాలు వేయటం, కూరలో ఉప్పువేయటం, పాలల్లో తోడు వేయటం వంటివి మర్చిపోవటం వ్యాధి గ్రస్తుల్లో కనిపిస్తాయి.



ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు...

మానసిక ప్రవర్తనలో ఆకస్మాత్తుగా మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత లోపించటం, అపాయింట్‌మెంట్స్ మర్చిపోవటం, జ్ఞాపకశక్తిని కోల్పోవటం వ్యాధి గ్రస్తుల్లో కనిపిస్తాయి. పసి పిల్లవాడికి ఏవిధంగా స్నానంచేయమని చెప్పాలో అదే విధంగా అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులకు ప్రతి ఒక్క విషయం గుర్తుచేయాలి. వ్యాధి రాకుండా ముందస్తు చర్యలో భాగంగా పుస్తకాలు చదవాలి. చెస్ ఆడటం, ఫజిల్స్ ఆడటం, మ్యూజికల్ వస్తువులు ప్లే చేయటం, పౌష్టిక ఆహారం తీసుకోవాలి. మందు, సిగిరెట్లు మానివేయాలి. సామాజిక బంధాలు పెంచుకోవాలి. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి వైద్యం చేయటం ద్వారా వ్యాధిని నివారించవచ్చు.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు



నియంత్రణలో పెట్టవచ్చు

అల్జీమర్స్ వ్యాధి వంశపారంపర్యంగా సోకే అవకాశం ఉంది. జ్ఞాపకశక్తిని పెంపొందించే సూడోకు, ఫజిల్స్‌ను చేయించటం, జంక్‌ఫుడ్, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండటం, శారీరక వ్యాయామం చేయటం ద్వారా వ్యాధికి దూరంగా ఉండటంతోపాటు నియంత్రణలో పెట్టవచ్చు. కుటుంబ సభ్యుల సహకారం వ్యాధి బాధితులకు తప్పనిసరిగా అవసరం.

– డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, మానసిక వ్యాధి నిపుణుల సంఘం జిల్లా అధ్యక్షుడు.



జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు

పక్షవాతం వచ్చిన వారికి మతిమరుపు వస్తుంది. ఇంట్లో ఎవరైనా వ్యాధి బాధితులు ఉంటే ఇతర సభ్యులు ముందస్తుగా అవగాహన కలిగి ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవటం చాలా మంచిది. అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులకు జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం. ఓపీ విభాగంలో ప్రతి శనివారం ప్రత్యేకంగా మెమరీక్లినిక్‌ను ఓపీలో ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారి, ప్రిన్సిపాల్, గుంటూరు వైద్య కళాశాల.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నెహ్రూనగర్: బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ విన్నవించారు. ఈ మేరకు శనివారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న బీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల వాగ్దానం చేశారని.. ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, నామినేషన్ వర్క్సలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతామని మరో వాగ్దానం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, గుంటూరు అర్బన్ యువజన అధ్యక్షులు డి.బ్రహ్మం పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం స్థానిక విద్యుత్ భవన వద్ద రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొర్రా సురేష్, నాగ వంశీ, భాషా, భరత్, తిరుపతిరావు,వేణు, గోపి, సలీం బాషా, వలి, వెంకటేశు, రాంబాబు, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదల అభివృద్ధితోనే దేశం వృద్ధి

కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న పెమ్మసాని, మంత్రి డోలా, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా పేదలు అభివృద్ధి చెందితేనే దేశం వృద్ధి చెందుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని బీఆర్ స్టేడియం సమీపంలోని కోడిగుడ్డు సత్రంలో రూ.3.48 కోట్లతో సాంఘిక సంక్షేమ శాఖ నిర్మించిన సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని పెమ్మసానితో పాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శఖాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చిత్ర పాటలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు, వేమూరు శాసన సభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గోళ్ల ప్రభాకర్, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి చెన్నయ్య, ఏఎస్‌డబ్ల్యూ శైలజ, ఏపీడబ్ల్యూఐజీ ఈఈ సంజీవ రావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

గుంటూరు మెడికల్: అరుదుగా ఎక్కడో.. ఎవరికో వచ్చే క్యాన్సర్ వ్యాధి, ఇప్పుడు విపరీతంగా విజృంభిస్తుందని, కారణాలేవైనా గానీ, ప్రతి ఒక్కరూ తమ జీవన విధానాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్‌ఎస్) చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు అన్నారు. స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు నగరంపాలెంలోని సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ లో 'ఆర్క' క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి సీనియర్ మెడికల్ డాక్టర్ వి.విద్య అధ్యక్షత వహించారు. డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ అదుపు తప్పిన జీవన శైలి కారణంగా తక్కువ వయస్సులోనే క్యాన్సర్లు కాటేస్తున్నాయన్నారు. డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ.. అనారోగ్యకర ఆహార అలవాట్లను అందరూ వదిలించుకోవాలన్నారు. ఆర్క హాస్పిటల్ రెడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.హిమని మాట్లాడుతూ క్యాన్సర్ కంటే, దాని చికిత్స ప్రక్రియ చాలా బాధగా ఉంటుందనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. ఎంత త్వరగా క్యాన్సర్‌ను గుర్తిస్తే, తగ్గే అవకాశాలు అంతగా పెరుగుతాయన్నారు. అనంతరం 63 మంది మహిళలకు బ్రెస్ట్ ఎగ్జామినేషన్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించి, తగు జాగ్రత్తలతో పాటు, మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్ శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆర్క హాస్పిటల్ ఆంకాలజీ డాక్టర్లు మాకినేని హేమంత్, పవన్ రాఘవరెడ్డి, రాజు నాయుడు, హిమనిలను సీజీహెచ్‌ఎస్ వైద్యులు అభినందించారు. కార్యక్రమంలో సీజీహెచ్‌ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, ఫార్మాసిస్టులు ఆయేషా బేగం సయ్యద్, సునీల్ సిబ్బంది మురళీకృష్ణ, రామారావు, మోహన్, మక్బుల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి ఆర్క ఆసుపత్రి ప్రతినిధులు ఆదిరెడ్డి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

లిటరరీ ఫెస్ట్‌లో విద్యార్థినులు ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో శనివారం నిర్వహించిన లిటరరీ ఫెస్ట్‌లో గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిబేట్, రోల్‌ప్లేలో బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థినులు బి.రమ్య, కె.అనుష్క, పోస్టర్ ప్రజెంటేషన్‌లో బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ఎ.అంజలి, వి.రత్నకుమారి ప్రథమ స్థానంలో నిలువగా, వ్యాసరచనలో బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థిని ఎండీ అమీనాఖాన్ ద్వితీయ బహుమతి సాధించినట్లు వివరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన టీంలు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని రూ.7,500 నగదు బహుమతి పొందినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

జీవనోపాధుల నిర్వహణపై అవగాహన



నెహ్రూనగర్: వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాధుల నిర్వహణపై రైతు ఉత్పత్తిదారు సంఘాలకు, మండల, గ్రామ స్థాయి డీఆర్‌డీఏ సిబ్బందికి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.యుగంధర్ మాట్లాడారు. ఆర్గానిక్ ఫార్మింగ్, మష్‌రూమ్, కిచెన్ గార్డెన్, గేదెలు, గొర్రెలు, పందుల పంపకం వంటి జీవనోపాధుల వలన కలిగే లాభనష్టాలు, ఆరోగ్య ప్రయోజనాలు, ఆర్థిక, అభివృది తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, ఏఎస్‌యూ మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ హెచ్‌ఓడీ శివరాం, పశుసంవర్ధక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఏపీడీ ఎస్.కిరణ్‌కుమార్, ఎల్‌హెచ్ డీపీఎం డాక్టర్ టి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

లోక కల్యాణం పథకంపై అవగాహన



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 లోక కల్యాణం పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో లోక కల్యాణం పథకంపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పథకం కింద అర్హులైన వీధి వ్యాపారులకు, చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వి.విజయలక్ష్మి, మెప్మా సిబ్బంది డి.పావని, వి.మాధవరావు, ఎస్‌డీ అహ్మద్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తులసి యోగీష్ జన్మదిన వేడుకలు


తులసి యోగీష్‌చంద్రకు జన్మదిన శుభాకాంక్షలు అందజేస్తున్న నాయకులు

కొరిటిపాడు(గుంటూరు): తులసి సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షులు తులసి యోగీష్ చంద్ర జన్మదిన వేడుకలు శనివారం అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య, తోట రామకష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, దాసరి వాసు, మిరియాల శ్రీనివాస్, బొక్కిసం శివరాం, దళవాయి సుబ్రహ్మణ్యం, పుచకాయల ఆనంద్, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు. తొలుత భారీ కేక్ కట్ చేశారు.

అభినందనలు తెలిపినవారిలో లక్ష్మిశెట్టి నాని, దేగల లక్ష్మీనారాయణ, పోలీస్ అధికారుల సంఘం నాయకులు మనికే లక్ష్మయ్య, పసుపులేటి రమణయ్య, యర్రంశెట్టి సూరి, తిరుమలశెట్టి రమేష్, కిరణ్, బెవరా శ్రీరాములు, కనకం నరసింహారావు, తరుణ్, భజరంగ్ రామకష్ణ, దుర్గా ప్రసాద్, వై.వి.సుబ్బారావు, పోలినేని సాంబశివరావు పాల్గొన్నారు.

బిహార్ ఓటు పరిణామాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, వేదికపై మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: బిహార్‌లో ఓటు పరిణామాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్- జాషువా- పూలే- పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం- ఎన్నికల కమిషన్ – ఓటు పరిణామాలు అంశంపై సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బిహార్‌లో ఓటర్ల జాబితాలో జరుగుతున్నా అక్రమాలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా ప్రధాన మంత్రి మోదీకి ఊడిగం చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారతదేశ 14 జాబితాలో అక్రమాలు జరుగుతే ప్రజాస్వామ్య ప్రక్రియ విఘాతం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో చిలుకా చంద్రశేఖర్, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, అంబేడ్కరిస్ట్ ఎస్.ప్రకాష్, చారువాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్, భీమ్ సేనా సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రుల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


గోడప్రతులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నసీర్

నగరంపాలెం: సమాజ సేవ చేయాలనే ఆశయం ఉండటం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆర్అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గూండా హరిప్రసాద్ ఆర్‌ఓ ప్లాంట్ అందించడాన్ని అభినందించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం శ్రీ దేవీశరన్నవరాత్రుల గోడప్రతులను ఆవిష్కరించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీలు నియమించామని ఎమ్మెల్యే అన్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు 11 రోజులు రావడం ప్రత్యేకమని కమిటీ చైర్మన్ కోట శేషగిరి తెలిపారు. కార్యక్రమంలో కొనకళ్ల సత్యం, ఈరంటి వరప్రసాద్, వనమా నరేంద్ర, కారంశెట్టి లోకేష్, కాకుమాను శ్రీనివాసరావు, జూలూరి గుప్తా, కూనిశెట్టి చంద్రశేఖరరావు, కొత్తూరి వెంకట్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: కూతురుకు ఆరోగ్యం సరిగా ఉండటంలేదని మనస్తాపానికి గురైన తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలు.. ఎల్ఆర్ కాలనీలో నివాసం ఉండే షేక్ ఇమామ్ (52) టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు సంతాన ఉన్నారు. కుమార్తె షర్మిలకు ఆరోగ్యం సరిగా ఉండకపోవటంతో నిత్యం బాధపడుతూ ఉండేవాడు. ఇటీవల కాలంలో ఆమె ఒక సర్జరీ కూడా చేశారు. దీనితో ఆమె బాధ చూడలేక మనస్తాపానికి గురైన ఇమామ్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేలకూలిన భారీ వృక్షం



జెడ్పీ ప్రాంగణంలో కుప్పకూలిన వందేళ్ల నాటి చింతచెట్టు


చెట్టు కూలడంతో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

జెడ్పీ ప్రాంగణంలోని ఓ భారీ వృక్షం నేలకొరిగింది. వందేళ్ల క్రితం నాటి వృక్షం కావడంతో కొమ్మలు విస్తరించి అధిక బరువు కారణంగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వేళ్లతో సహా కూలిపోయింది. భారీ చింతచెట్టు విద్యుత్ తీగలపై పడటంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అర్ధరాత్రి సమయం కావడంతో పెను ప్రమాదం తప్పింది.

– గుంటూరు ఎడ్యుకేషన్